సాములోరి భూ మాయ!

- సంస్కృత పాఠశాల ఏర్పాటు, వేద విద్య బోధన కోసమంటూ గతంలో భీమిలి వద్ద 15 ఎకరాలు తీసుకున్న శారదా పీఠం
- ఇప్పుడు మాట మార్చిన వైనం



... మెయిన్‌లో

రోడ్ల నిర్మాణంలో నాణ్యతాలోపం

టెండర్ నిబంధనలను తుంగలో తొక్కేస్తున్న కాంట్రాక్టర్లు

తూతూమంత్రంగా పనులు

- పెదజాలరిపేట, శివాజీపాలెం ప్రాంతాల్లో ఇటీవల నిర్మించిన రోడ్ల నాణ్యతపై విమర్శలు
- పట్టించుకోని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు
- విజిలెన్స్ అధికారులు దృష్టిసారించాలనే అభిప్రాయాలు



శివాజీపార్కు వద్ద రోడ్డు పరిస్థితి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రహదారుల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులను ప్రసన్నం చేసుకుని తూతూమంత్రంగా పనులు సాగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. టెండర్ నిబంధనల ప్రకారం రోడ్ల నిర్మాణంలో నాణ్యత, ఇతర ప్రమాణాలను పాటించడంతోపాటు రోలింగ్ పక్కాగా చేయాలి. కానీ అవేమీ పట్టించుకోవడం లేదు. ఇంజనీరింగ్ అధికారులు కూడా తమకు సంబంధం లేదన్నట్టు అటు వైపు కన్నెత్తిచూడకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



రోలింగ్ సరిగా చేయకపోవడంతో పిక్కలేచిపోయిన రోడ్డు

నగరంలో ప్రస్తుతం జీవీఎంసీ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణం జరుగుతోంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో తూర్పు నియోజకవర్గంలోని 17, 20, 22 వార్డుల పరిధిలో విస్తరించి ఉన్న శివాజీపార్కు ముందున్న డబుల్‌రోడ్డును ఇటీవల పునర్నిర్మించారు. శివాజీపాలెం సాయిబాబా గుడి నుంచి రామలక్ష్మి అపార్టుమెంట్ జంక్షన్ వరకూ 650 మీటర్లు పొడవున ఉన్న రహదారి నిర్మాణానికి రూ.2.4 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రాత్రికి రాత్రే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేశారు. హడావుడిగా పనులు చేయడం, ... మిగతా 6వ పేజీలో

పండుగ పూటా పస్తులే!!

- పెన్షనర్లకు చెల్లింపులు జరపని స్టీల్‌ప్లాంటు యాజమాన్యం
- వేయి కుటుంబాలు విలవిల

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం పండుగ పూట కూడా పెన్షనర్లను పస్తులు ఉంచుతోంది. వారికి యాజమాన్యం ఏనాడూ సమయానికి పెన్షన్లు ఇచ్చిన పాపాన పోలేదు. అధికారులు, కార్మికులకు ఐదో తేదీలోపు జీతాలు అందుతున్నా..పెన్షనర్లకు మాత్రం 20వ తేదీ తరువాతే ఇస్తున్నారు. గత నెల అయితే 24వ తేదీన ఇచ్చారు. ఇప్పుడు పెద్ద పండుగ సంక్రాంతి వచ్చినా ఇంతవరకూ వారికి రూపాయి విడుదలచేయలేదు. సుమారు వేయి కుటుంబాలు స్టీల్‌ప్లాంటు నుంచి పెన్షన్ పొందుతున్నాయి. వారంతా తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

ఉద్యోగి చనిపోతే ఆయన భార్యకు సర్వీసు కాలం పూర్తయ్యేంత వరకు పెన్షన్ ఇస్తారు. దీనికి అనేక షరతులు ఉన్నాయి. ప్లాంటు బయట ఏ ఉద్యోగి అయినా చనిపోతే వారికి గ్రాట్యుటీ, పెన్షన్ కలిపి సుమారు రూ.50 లక్షలు పైనే వస్తాయి. ఈ మొత్తాన్ని మరణం సంభవించిన మూడు నెలలలోపు స్టీల్‌ప్లాంటు ఏర్పాటు చేసిన ట్రస్టుకు అప్పగిస్తే..నెలనెలా పెన్షన్ ఇస్తారు. అదే ప్లాంటులో పనిచేస్తూ చనిపోతే పెన్షన్, గ్రాట్యుటీ ట్రస్టుకు కట్టక్కర్లేదు. ఎలా చనిపోయినా సరే ఆ ఉద్యోగి అప్పటికి ఎంత బేసిక్ పే, డీఏ తీసుకుంటున్నారో ఆ మొత్తాన్ని పెన్షన్‌గా ఇస్తారు. ఇలాంటి వారు సమారుగా వేయి మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.4 కోట్లు పెన్షన్‌గా చెల్లించాలి. ఈ నెలలో అధికారులు, కార్మికులకు జీతాలు ఇచ్చారు. కార్మికులకు బోనస్ కూడా ఇచ్చారు. కానీ పెన్షనర్లకు పెన్షన్లు మాత్రం ఇవ్వలేదు. సంక్రాంతిని దృష్టిలో ఉంచుకొని రెండు, మూడు దఫాలుగానైనా ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

డీసీసీబీ పాలకవర్గం పదవీకాలం పొడిగింపు

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలక వర్గం పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించారు. కోలా గురువులు ఛైర్మన్‌గా ఆరు నెలల క్రితం నియమించిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ కాలపరిమితి ఈనెల 17వ తేదీతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో కమిటీ కాల పరిమితిని ఈనెల 18 నుంచి జూలై 17వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గత ఏడాది జూలైలో గురువులతోపాటు మరో ఆరుగురు సభ్యులతో పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమించిన విషయం తెలిసిందే.

షుగర్ పెరుగుతోంది



కొవిడ్ తరువాత భారీగా పెరిగిన డయాబెటిస్ బాధితులు

- కేజీహెచ్‌లోని ఎండోక్రైనాలజీ విభాగంలో వారానికి మూడు రోజులు ఓపీ
- ఒక్కోరోజు 400 మంది వరకూ రాక
- అందులో కొత్తవారు సుమారు 80 మంది
- యుక్త వయస్కుల్లోనూ సమస్య
- ప్రతి వంద మందిలో 62 మంది మహిళలు.. 38 మంది పురుషులు
- ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడమే కారణం

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): షుగర్ బారినపడుతున్న వారి సంఖ్య గడిచిన కొన్నాళ్లుగా బాగా పెరుగుతోంది. ముఖ్యంగా కొవిడ్ తరువాత కేసులు గణనీయంగా పెరిగినట్టు వైద్యులు చెబుతున్నారు. కేజీహెచ్‌లోని ఎండో క్రైనాలజీ విభాగం ఓపీకి ఐదేళ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం 20 శాతం మేర రోగులు పెరిగినట్టు పేర్కొంటున్నారు. కరోనా వైరస్ వ్యాప్తికి ముందు, తరువాత చాలా వ్యత్యాసం కనిపిస్తోందంటున్నారు. కేజీహెచ్‌లో ఎండో క్రైనాలజీ విభాగంలో మంగళ, గురు, శనివా రాల్లో ఓపీ సేవలు అందిస్తుంటారు. ఆయా రోజుల్లో షుగర్ బాధితులు సుమారు 450 మంది చొప్పున వస్తున్నారు. వీరిలో కొత్తగా వచ్చేవారి సంఖ్య 70-80 వరకు ఉంటుంది. మొత్తంలో 25-30 ఏళ్ల వయస్కులు పది మంది, 30-35 ఏళ్ల మధ్యవారు పది నుంచి 15 మంది వరకూ ఉంటున్నారు. 35 ఏళ్లు పైబడిన వాళ్లు 40 నుంచి 55 మంది ఉంటున్నారు.

యుక్త వయస్కుల్లో పెరుగుదల

గతంతో పోలిస్తే యుక్త వయస్కుల్లో షుగర్ సమస్య పెరుగుతోంది. గతంలో 35 ఏళ్లలోపు వందలో ఇద్దరు, ముగ్గురికి మాత్రమే షుగర్ కనిపించేది. ప్రస్తుతం ఆ సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. ప్రతి వంద కొత్త కేసుల్లో కనీసం 15 నుంచి 20 మంది 30 ఏళ్లలోపు వారు ఉంటున్నారు. అదే 40 ఏళ్లలోపు వాళ్లు అయితే 40 శాతం ఉంటున్నారు. షుగర్ బాధితుల్లో 20 శాతం మందికి ఇన్సులిన్ ఇవ్వాల్సి వస్తోంది. మిగిలినవాళ్లు టాబ్లెట్లతో నియంత్రణలో ఉంచుకుంటున్నారు. ఇన్సులిన్ ఇవ్వాల్సి వస్తున్న ప్రతి పది మందిలో ఒకరు 30 ఏళ్లలోపు వాళ్లు ఉండడం గమనార్హం. ఇకపోతే, కేజీహెచ్‌కు వచ్చే షుగర్ బాధితులను పరిశీలిస్తే మహిళలు అధికంగా ఉంటున్నారు. వంద మందిలో 62 మంది మహిళలు ఉంటే, 38 మంది పురుషులు ఉంటున్నారు. పురుషులతో పోలిస్తే మహిళలు క్రమం తప్పకుండా మందులు వినియోగించడం, ఇతర జాగ్రత్తలను పాటించడంలో శ్రద్ధ వహిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

సుదూర ప్రాంతాల నుంచి..

కేజీహెచ్ ఎండోక్రైనాలజీ విభాగానికి వస్తున్న వారిలో ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పుగోదావరి, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాలవారు ఉంటున్నారు. రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన మందులు అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్ల కోసం 30 పడకలతో ప్రత్యేక వార్డు అందుబాటులో ఉంది.

కారణాలు ఇవే..

జన్యుపరమైన కారణాలు, ... మిగతా 6వ పేజీలో

వెనక్కి తగ్గని అంగన్‌వాడీలు



అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా వెనక్కి తగ్గడం లేదు. 32వ రోజు సమ్మె కొనసాగింది. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం జగనన్నకు చెబుదాం పేరుతో సంతకాలను సేకరించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. - వివరాలు I పేజీలో

జంక్షన్‌లు జామ్



జగదాంబ జంక్షన్‌లో స్తంభించిన ట్రాఫిక్

నగరంలోని అనేక ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి ట్రాఫిక్ జామ్ అయింది. పండుగ షాపింగ్ చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో అనేక ప్రాంతాలు రద్దీగా మారాయి. ముఖ్యంగా డాబాగార్డెన్స్, జగదాంబ, ఆశీల్‌మెట్ట జంక్షన్, పాత జైలు రోడ్డు జంక్షన్, తదితర ప్రాంతాలు వాహనాలతో కిక్కిరిశాయి. ఒక్కో సిగ్నల్ పాయింట్ దాటేందుకు కనీసం 30 నిమిషాలు సమయం పట్టింది. పాత జైలు రోడ్డు జంక్షన్‌లో ఏసీపీ రాజీవ్‌కుమార్ దగ్గరుండి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

- విశాఖపట్నం

పండక్కి ఇంటికి వెళుతుండగా...

లారీ ఢీకొని ఇద్దరి మృతి



లారీ చక్రాల కింద మృతులు



లోకనాథం (ఫైల్ ఫొటో)

ఎం.వి.పి.కాలనీ/సారవకోట, జనవరి 12: పండక్కి సొంతూరు బయలు దేరిన ఇద్దరిని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళిం చింది. ఇందుకు సంబంధించి ఆరిలోవ ట్రాఫిక్ ఎస్.ఐ. శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం కూర్మనాథపురం పంచాయతీ మర్రిపాడుకు చెందిన కూర్మనాథపురం మీనా (30), అదే ప్రాంతంలో గల బంజీరుపేట గ్రామానికి చెందిన జెన్న లోకనాథం (25) ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చారు. ప్రస్తుతం చినగదిలి హెల్త్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనంలో పనిచేస్తున్నారు. పండుగకని శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై స్వస్థలా నికి బయలుదేరారు. అయితే వీరి వాహనాన్ని జాతీయ రహదారిపై జూపార్కు సమీపంలో లారీ ఢీకొంది. దీంతో మీనా, లోకనాథం వాహనం పైనుంచి లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. లోకనాథం తండ్రి కొన్నాళ్ల కిందట చనిపోయారు. అతని తల్లి చిరంజీవులు కుమారుడిపైనే ఆధారపడి జీవిస్తోంది. ఉపాధి కోసం వెళ్లిన కుమారుడు.. ప్రమాదవశాత్తూ మృతి చెందడంతో ఇక తమకు దిక్కెవరంటూ లబోదిబోమని రోదిస్తోంది. ఇక మీనాకు తల్లిదండ్రులు అప్పలమ్మ, చలపతి ఉన్నారు. కుటుంబాన్ని పోషించే కుమార్తె మృతి చెందడంతో వారిద్దరూ కన్నీటిపర్యంతమవుతున్నారు.

ఆలయ భూమికి ఎసరు

అనంత పద్మనాభస్వామి దేవస్థానం స్థలం అన్యాక్రాంతం

- కొండ తవ్వి అక్రమంగా ఇళ్ల నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికారులు
- రాజకీయ నాయకుల ఒత్తిళ్లే కారణం



దేవస్థానం భూమిలో ఇళ్ల నిర్మాణం

పద్మనాభం, జనవరి 12: అనంత పద్మనాభస్వామి దేవస్థానానికి చెందిన భూమిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ విషయంలో ఆలయ ఉద్యోగులే కీలకపాత్ర పోషిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పద్మనాభంలో స్వామి కొలువైన కొండ దేవస్థానం పరిధిలో ఉండడంతో 1995 తరువాత ఆ చుట్టుపక్కల ఇళ్ల స్థలాలు ఇవ్వడం రెవెన్యూ శాఖ నిలిపివేసింది. అయితే రాజకీయ నాయకుల ఆశీస్సులు, దేవస్థానం ఉద్యోగుల సహకారంతో కొంతమంది అక్రమంగా నిర్మాణాలను చేపడుతున్నారు. ఇటీవల కొండ దిగువన జేసీబీతో కొంత భూమిని చదును చేసి ఇళ్ల నిర్మాణానికి అనువుగా తయారుచేశారు. ఆ గ్రావెల్‌ను అనధికారికంగా తరలించారు. రెండు, ... మిగతా 6వ పేజీలో

విమ్స్‌కు అధునాతన పరికరాలు

- రూ.53 లక్షలతో కొనుగోలు
- అందుబాటులోకి రానున్న ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, ఈఆర్‌సీపీ సేవలు



విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)కు అధునాతన వైద్య పరికరాలు రానున్నాయి. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం కోసం రూ.53 లక్షలతో ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, ఎండోస్కోపిక్ రిట్రోగ్రేడ్ కొలాంజియో పాంక్రియాటోగ్రఫీ (ఈఆర్‌సీపీ) పరికరాలు కొనుగోలు చేశారు. ఇవి రెండు, మూడు రోజుల్లో విజయవాడ నుంచి విమ్స్‌కు రానున్నాయి. సంక్రాంతి తరువాత వీటిని ఇన్‌స్టాల్ చేసి, ఈ నెలాఖరు నుంచి రోగులకు అందుబాటులో తీసుకురానున్నట్టు ఆస్పత్రి అధికారులు చెబుతున్నారు. ఎండోస్కోపీ ద్వారా జీర్ణకోశం, అన్నవాహికకు సంబంధించిన సమస్యలు, కడుపులో అల్సర్లు, జీర్ణకోశ కేన్సర్లను గుర్తించవచ్చు. అలాగే పెద్దపేగు కేన్సర్లు, ట్యూమర్లు, ఇతర సమస్యలను కొలనోస్కోపీ, గాల్ బ్లాడర్‌లో స్టోన్స్‌తో పాటు కొన్నిరకాల కేన్సర్లను నిర్ధారించేందుకు ఈఆర్‌సీపీ మెషీన్లు ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు. ఈ పరీక్షలు చేయించుకోవాలంటే చాలా ఖర్చవుతుందని, విమ్స్‌లో ఉచితంగా చేయనున్నట్టు పేర్కొన్నారు. అలాగే, గ్యాస్ట్రిక్‌కు సంబంధించిన అన్నిరకాల సమస్యలను గుర్తించేందుకు అవసరమైన హై అండ్ పరికరం ఎండోస్కోపిక్ అల్ట్రా సోనోగ్రఫీ (ఈయూఎస్) కూడా విమ్స్‌కు మంజూరైందని అధికారులు తెలిపారు. ఈ పరికరం అందుబాటులోకి వస్తే గ్యాస్ట్రో ఎంట్రాలజీకి సంబంధించి అత్యుత్తమైన వైద్య సేవలు విమ్స్‌లో అందించేందుకు అవకాశముంటుందని డైరెక్టర్ కె.రాంబాబు తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

- 37,774 మంది విద్యార్థులు...138 కేంద్రాలు



విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చి 18వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు జిల్లా విద్యా శాఖ ఏర్పాట్లుచేస్తోంది. అన్ని మేనేజ్‌మెంట్‌ల పరిధిలోని 455 పాఠశాలల నుంచి 37,774 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 33,835 మంది ఇంగ్లీష్, 3,929 మంది తెలుగు, తొమ్మిది మంది ఒరియా, పది మంది ఉర్దూ మాధ్యమంలో పరీక్షలు రాయనున్నారు. మేనేజ్‌మెంట్ వారీగా చూస్తే..60 జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 6,525 మంది, 350 ప్రైవేటు పాఠశాలల నుంచి 19,039 మంది, నాలుగు ప్రభుత్వ పాఠశాలల నుంచి 722 మంది, 21 జీవీఎంసీ పాఠశాలల నుంచి 2,283 మంది, మూడు బీసీ వెల్ఫేర్ స్కూళ్ల నుంచి 280, మూడు కేజీబీవీ ల నుంచి 114 మంది, ఏడు ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల నుంచి 395, ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ పాఠశాల నుంచి 78 మంది, మూడు సాంఘిక సంక్షేమ సొసైటీ పాఠశాలల నుంచి 211 మంది, రెండు గిరిజన సంక్షేమ సొసైటీ పాఠశాలల నుంచి 121, ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి 26 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. వీరి కోసం 138 కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారు. కాగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం విద్యా శాఖ 100 రోజుల ప్రణాళిక అమలుచేస్తోంది. రోజువారీ పరీక్షలు నిర్వహించి చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హెచ్‌ఎంలను డీఈవో ఆదేశించారు.

'జాబితాల్లో ఓటు ఉందో లేదో చూసుకోవాలి'

అక్కయ్యపాలెం, జనవరి 12: ఉత్తర నియోజకవర్గంలో జాబితాలో ఓటు ఉందో లేదో చూసుకోవాలని మాజీ క్రికెటర్ జీవీఎస్ కమలాకర్ ప్రజలకు పిలునిచ్చారు. ఎన్నికల రోజు ఓటు వేసే సమయంలో పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి ఇబ్బంది పడడంకన్నా ముందుగా లిస్ట్‌లో ఓటును చూసుకోవాలన్నారు. నియోజకవర్గ పరిధిలో 20 వేలకు పైగా దొంగ ఓట్లు నమోదయ్యాయని, వాటిని తొలగించే పనిలో యంత్రాంగం ఉం దన్నారు. అలాగే, వచ్చే ఎన్నికల్లో విద్యావంతుడిని ఎన్నుకోవాలన్నారు. దీని వల్ల తమ పిల్లల భవిష్యత్‌కు, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడుతుందని చెప్పారు.

21 నుంచి పోలమాంబ జాతర మహోత్సవాలు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాజీ బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్

జగదాంబ కూడలి, జనవరి 12: జగదాంబ కూడలి లేపాక్షి వద్ద కుమ్మరవీధిలోని పోలమాంబ 66వ పరస మహోత్సవాలు పురస్కరించుకుని క్యాలెండర్, ఆహ్వాన పత్రికలను బ్రహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ఆవిష్కరించారు. శుక్రవారం అయన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. పోలమ్మ తల్లి పరస ఉత్సవాలు ఈనెల 21 వతేదీనుంచి 23 తేదీ వరకు జరగనున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు వై.రాజు, కాళ్ల కిరణ్, శ్రీనివాస్, తమ్మిన చిన్న, కనకల నాణి, అయ్యబాబుపాల్గొన్నారు.

ప్రజలకు దూరంగా జగన్: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

అల్లిపురం, జనవరి 12: ఎన్నికల ముందు ఓదార్పు యాత్రపేరుతో జనం మధ్య తిరిగిన సీఎం జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు దూరంగా ప్యాలెస్‌కు పరిమితమవుతున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. శుక్రవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో విశాఖ జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జగన్ ప్రభుత్వం తీరుపై సొంత పార్టీ ప్రజాప్రతినిధులూ అసంతృప్తిగా ఉన్నారన్నారు.అధికారాన్ని తన గుప్పెట్లో పెట్టుకొని అందరినీ ప్రేక్షకులుగా మార్చేశాడని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఎదురు దెబ్బ తగులుతుందన్నారు.జిల్లా నాయకులు ఎం.పైడిరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలోనే బీసీలకు పెద్దపీట

▸ టీడీపీ 'ఉత్తర' ఇన్‌చార్జి విజయ్‌బాబు

సీతంపేట: బీసీలకు టీడీపీ అధినేత చంద్రబాబు పెద్దపీటవేశారని ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌బాబు అన్నారు. గ్రేటర్ 25వ వార్డులో వార్డు అధ్యక్షుడు నమ్మి రవికుమార్, 14వ వార్డు టీడీపీ అధ్యక్షులు గొంప ధర్మారావు ఆధ్వర్యంలో గురుద్వార కూడలిలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగావిజయ్‌బాబు మాట్లాడుతూ, బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం బీసీలకు ఓటు బ్యాంక్‌గానే ఉపయోగించుకుంటుందని ఆరోపించారు. బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనారిటీలపై అనేక దాడులు చేస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నాయకులు విజయ్‌కుమార్, ఇసరపు వాసు, ఇసరపు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



25వ వార్డులో నినాదాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

రెవెన్యూ శాఖ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, జనవరి 12: రెవెన్యూ శాఖ- 2024వ సంవత్సరానికి చెందిన డైరీని కలెక్టర్ ఏ మల్లికార్జున ఆవిష్కరించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జేసీ కేఎస్ విశ్వనాథన్, జిల్లా రెవె న్యూ అధికారి కే మోహనకుమార్, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ తది తరులతో కలసి డైరీని ఆవిష్కరించారు.కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, అధికారులున్నారు.

గౌడ సంఘం క్యాలెండర్...

మహారాణిపేట: విశాఖ గౌడ సంఘం వార్షిక క్యాలెండర్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆవిష్కరించారు. విశాఖ గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మేరువ గణేష గౌడ్ అధ్యక్షతన సంఘం సభ్యులు శుక్రవారం మేయర్‌ను మర్యాద పూర్వకంగా కలసి ఆమె చేతులు మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గౌడ సామాజిక వర్గం భవనం మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మార్గాని రామారావు గౌడ్, రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ కామన సుబ్బారావు గౌడ్, ఏవీఎస్ఎన్ మూర్తి, దివి నారాయణరావు, మధుసూదన్, శ్రీనివాస గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ఉర్స్ ఉత్సవాలు



చందనోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మర్రిపాలెం: మర్రిపాలెంలోని మదీనా మెమోరియల్ ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హజరత్ ఖాదర్ అలీ, హజరత్ మౌలా అలీ ఉర్స్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత మసీదులో ముస్లింలు ఖురాన్ పఠించి చిన్నారులచే నాతేకలాం ఆలపించారు. అనంతరం చందనోత్సవ ర్యాలీ నిర్వహించి పాతీహాఖానీ జరిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగాశనివారం చిన్నారులతో ప్రత్యేక కార్యక్రమం, ఆదివారం కవ్వాలి పోటీలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పూర్ణామార్కెట్: గ్రేటర్ 38వ వార్డు బుక్కావీధి దర్గావద్ద యాసిన్ బాబా చందనోత్స వాన్ని శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరిపారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడు ధర్మారావుకు ఘన సత్కారం

అక్కయ్యపాలెం, జనవరి 12 : ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర సాహిత్య అకాడమీ, ఏలూరు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సాహిత్య సంక్రాంతి సంబరాలు, కవి సమ్మేళనంలో గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, కవిశ్రేష్ఠ బిరుదాంకితులు ఎంవీ ధర్మారావుకు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మీనరస, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

చీరలు, దుప్పట్లు పంపిణీ

అక్కయ్యపాలెం, జనవరి 12 : విశాఖ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కేవీ బాబా మనమడు ఎండీ ఖాజా మోహినుద్దీన్ నవాజ్ ప్రథమ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నరసింహనగర్‌లోని ఆయన స్వగృహంలో కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. తాజుద్దీన్, ఇస్మాయిల్, నిజాం, బాషా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మర్రిపాలెం, జనవరి 12: శ్రీ విజయనగర కాలనీ, 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం-1లో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 1997-2022లో చదువుకున్న వారంతా 300మంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపలను పంచుకుని ఆటపాటలతో గడిపారు. తరగతి గదులు, గ్రంథాలయం, ల్యాబ్‌ను సందర్శించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం విందు భోజనాలు చేశారు. ఈసందర్భంగా వారు మా ట్లాడు తూ, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు మురళీపట్నాయక్, ఉపాధ్యక్షులు వి.నాగేశ్వరరావు, బి.జోసెఫ్, కార్యదర్శులు కె.మాధవి, ట్రెజరర్ సదరం సన్నిబాబు, కమిటీ సభ్యులు పి.జగన్నాథ్, పంకజ్‌రాథోడ్, వి.కల్పన, గౌరీఈశ్వరి, సునీ లారాణి, జి.జోన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'కేవీ స్వామి సేవలు మరువలేం'



స్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మహారాణిపేట, జనవరి 12: టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షులు కేవీ స్వామి సేవలు మరువలేనివని ఆ పార్టీ కార్యదర్శి పాశర్ల ప్రసాద్ అన్నారు. ఇటీవల మృతిచెందిన కేవీ స్వామి సంతాప సభను శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీకి స్వామి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ కార్యదర్శి గిరిధర్, రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ, నాయకులు ఎస్‌వీ సుమన్, సి. ఉమాదేవి, శోభన్‌బాబు, సతీష్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్

కంచరపాలెం, జనవరి 12: గత ఇరవై మూడు రోజులుగా సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం విరమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉద్యోగులతో అర్బన్ మండలంలో నాలుగు మండలాల ఎంఈవోలు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ సిబ్బంది శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఏపీవో అప్పలనాయుడు విద్యాసంబంధిత కార్యాకలాపాల పెండింగ్‌పై చర్చించారు. ఉద్యోగులు జీఈఆర్, డ్రాపౌట్స్, ఫార్మేటివ్ పరీక్షల ప్రశ్నపత్రాల పంపిణీ తదితర అంశాలపై దృష్టిని సారించి పూర్తిచేయాలని సూచించారు. విద్యా సంబంధిత పథకాల అమల్లో విశాఖ జిల్లాను ముందుంచాలని కోరారు. ఎంఈవోలు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు

సీతమ్మధార, జనవరి 12: స్వామి వివేకానంద 161వ జయంత్యుత్సవం సీతమ్మధార శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశాఖ రామకృష్ణా మిషన్‌కు చెందిన ఆది స్వరానంద స్వామీజీ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. యువజన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు స్వామి వివేకానందుని వేషధారణలో అలరించారు. విద్యార్థులు చిత్రించిన స్వామి వివేకానందుని చిత్రపటాన్ని ఆది స్వరానందస్వామీజీ ఆవిష్కరించారు. వివేకానందుని జీవిత ఘట్టాలను వివరించారు. కొందరు విద్యార్థులు స్వామి వివేకానందుని జీవిత చరిత్రను నాటికగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న శ్రీప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాష్ విద్యార్థులకు యు వజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



శ్రీ ప్రకాష్‌లో వివేకానందుని వేషధారణలో విద్యార్థులు



వివేకాందుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు

మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో..

మాధవధార; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి అధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వాకర్స్ క్లబ్ 101 గవర్నర్ సభ్యులు టి. రంగారావు స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మహారాణిపేట: జాతీయ యువజన దినోత్సవం ఏవీఎన్ కళాశాలలో నిర్వహించారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామీజీ గీతా సారందాజీ, జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రతినిధి రహీ మనీస్సా బేగం, ప్రిన్సిపాల్ ఎం సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వాడవాడలా సంక్రాంతి సంబరాలు



ముగ్గుల పోటీ విజేతకు బహుమతి అందిస్తున్న జనసేన ఇన్‌చార్జి ఉషాకిరణ్

మురళీనగర్; మాధవధారలో వైసీపీ నాయకుల అధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, గంగిరెద్దులు, కోడి పందేలు, రంగవల్లులతో మాధవస్వామి కల్యాణ మండపం పండగ వాతావరణం నెలకొంది. ముఖ్య అతి థిగా విచ్చేసిన ఆపార్టీకోర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, నార్త్ కో-ఆర్డినేటర్‌తో కలసిక్యాలెండర్ ఆవిష్కరించారు.అనంతరం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు దస్తులను పండుగ కానుకగా అందించారు. వైసీపీ నగర అధ్యక్షులు కోలా.గురువులు, డిప్యూటీ మేయరు కె.సతీష్, పేడాడ.రమణికుమారి ఉన్నారు.

సాలిగ్రామపురంలో ...

అక్కయ్యపాలెం: ఉత్తర నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ ఆధ్వర్యంలో సాలిగ్రామపురం పోర్టు స్కూల్ సమీపాన ఆలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులందించారు. న్యాయ నిర్ణేతలుగా పాలూరి శేషమాంబ, సంకు వేంకటేశ్వరరావు వ్యవహరించారు. త్రినాద్,దివాకర్,అడబాల లక్ష్మి ఉన్నారు.

వైసీపీ నేతలైతే ఓకేనా?

వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో కోడి పందెం



కోడి పందేలను వీక్షిస్తున్న వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి, నాయకులు

మాధవధార: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీతో సహా స్థానికంగా ఉన్న పోలీసు అధికారులు హెచ్చరికలు జారీచేస్తున్నారు. అయితే సంక్రాంతి సంబరాల్లో భా గంగా శుక్రవారం మాధవధారలో నిర్వహించిన కోడిపందేలను ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ కో-ఆర్డినేటర్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఉత్తరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు, ఆ పార్టీ సిటీ ప్రెసిడెంట్ కోలా గురువులు దగ్గరుండి వీక్షించారు. నేతలతో కలిసి కోళ్లను ఉత్సాహపరిచేలా సందడి చేశారు. కోడి పందేలు వద్దని పోలీసులు హెచ్చరిస్తుంటే, అధికార పార్టీ నేతలే దగ్గరుండి నిర్వహించడం దేనికి సంకేతమని కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆశ్చర్యపోయారు.

అంతంతమాత్రంగా స్పందన

▸ యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు ముందుకు రాని ఆక్రమణదారులు

▸ 1,269 మందికి నోటీసులు, 592 మంది దరఖాస్తు

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) కింద ప్రభుత్వ స్వాధీనం చేసుకున్న భూముల్లో వెలిసిన కట్టడాల క్రమబద్ధీకరణకు విధించిన గడువు గతనెల 31తో ముగిసింది. నగరంలో అత్యంత విలువైన ప్రాంతాల్లో నిర్మాణాలు క్రమబద్ధీకరించుకనేందుకు ప్రముఖులు ఎవరు ముందుకు రాలేదు. చివరకు బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలస్‌లో ఆక్రమణల క్రమబద్ధీకరణకు కూడా దరఖాస్తు చేయలేదు. నగర పరిధిలో సుమారు 86 హెక్టార్ల యూఎల్‌సీ భూముల్లో 3,600 కట్టడాలున్నట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. వీటి క్రమబద్ధీకరణకు గత ఏడాది ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీనిప్రకారం 150 గజాలలోపు విస్తీర్ణంలో నిర్మాణాలకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తారు. 150 గజాలు దాటిన కట్టడాలకు నిర్ణీత మొత్తం వసూలు చేస్తారు. ఈమేరకు 1,269 మంది ఆక్రమణదారులకు నోటీసులు జారీచేయగా, వాటిలో 150 గజాలలోపు 999మంది, 150 గజాలు దాటిన 270 మంది ఆక్రమణదారులున్నారు. వీరిలో 150 గజాలలోపు 524 ఆక్రమణదారుల నుంచి దరఖాస్తులందగా 350 మంది భూముల రెగ్యులేషన్‌కు ప్రభుత్వానికి పంపారు. 150గజాలు దాటిన ఆక్రమణలకు సంబంధించి 63మంది మాత్రమే స్పందించి క్రమబద్ధీకరణకు సుమారు రూ. రెండుకోట్ల ఫీజు చెల్లించారు. నగరంలో మిగిలిన కట్టడాల కోసం దరఖాస్తులు అందలేదు. ఈ విషయాన్ని జేసీ కేఎస్ విశ్వనాథన్ వద్ద ప్రస్తావించగా క్రమబద్ధీకరణ గడువు ముగిసిందని, వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వానికి పంపామన్నారు. మిగిలిన వారి విషయంలో ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలుంటాయన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతాలోపం

... 5వ పేజీ తరువాయి

పైగా రోలింగ్ సరిగా చేయకపోవడంతో వాహనాలు వెళుతుంటే పిక్కలు లేచిపోతున్నాయి. సాధారణంగా రోడ్డు నిర్మిస్తుంటే ఇంజనీరింగ్ విభాగంలో సంబంధిత వార్డు బాధ్యతలు చూసే ఏఈ లేదా వర్క్ ఇన్‌స్పెక్టర్ దగ్గరుండి పర్యవేక్షించాలి. తారు నాణ్యతతోపాటు పిక్క పరిమాణం ప్రమాణాలకు అనుగుణంగా ఉందా?, లేదా?...అనేది తనిఖీ చేయాలి. అలాగే రోడ్డు నిర్మాణం బిట్లు, బిట్లుగా జరిగేలా చూడాలి. టెండర్ నిబంధనల్లో పేర్కొన్నట్టుగా సరైన మందంతో రహదారి వేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే తారులేయర్ వేసిన వెంటనే హైడ్రాలిక్ రోలర్‌తో బాగా రోలింగ్ చేయించాలి. కానీ శివాజీ పార్కు ముందున్న డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు దీనికి పూర్తి విరుద్ధంగా జరిగాయి. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రెండు రోజులకే రోడ్డుపై పిక్కలు లేచిపోతున్నాయి. రోలింగ్ కూడా సరిగా చేయకపోవడంతో వాహనాల ఒత్తిడికి రోడ్డు కుంగిపోయి గోతులు ఏర్పడుతోంది. రూ.2.4 కోట్లు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఈ రోడ్డు ఎంతోకాలం ఉండదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

మరోవైపు 19వ వార్డు పరిధి పెదజాలరిపేటలో మెయిన్‌రోడ్డు నిర్మాణం రూ.93 లక్షల వ్యయంతో ఇటీవల చేపట్టారు. నాలుగు అంగుళాలు మందంతో రోడ్డు నిర్మించాల్సి ఉండగా చాలాచోట్ల రెండు అంగుళాలులోపే ఉన్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు తారుతో కూడిన మిక్సింగ్ వేసిన తర్వాత పూర్తిస్థాయిలో రోలింగ్ చేయాల్సి ఉండగా దాన్ని పూర్తిగా విస్మరించినట్టు చెబుతున్నారు. రోడ్డు అంచులను సరిగ్గా రోలింగ్ చేయకుండానే వదిలేశారు. ఈ హడావుడి నిర్మాణంతో రోడ్డు మన్నికపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు మౌనం పాటిస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దీనిపై దృష్టిసారిస్తే అక్రమాలు బయట పడతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

షుగర్ పెరుగుతోంది

... 5వ పేజీ తరువాయి

హార్మోన్ల అసమతుల్యతతో పాటు కొవిడ్ తరువాత శారీరక శ్రమ తగ్గడం, ఉద్యోగ భద్రత, ఆర్థికపరమైన ఇబ్బందులతో తీవ్రమైన ఒత్తిడికి గురి కావడం, మారిన ఆహారపు అలవాట్లు, సమయానికి నిద్రలేకపోవడం వంటివి షుగర్ రావడానికి కారణమవు తున్నాయి. ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవ డంతో పాటు శారీరక శ్రమ చేయడం వల్ల ఈ సమస్యకు చెక్ చెప్పవచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ప్రశాంతమైన జీవనాన్ని అలవాటు చేసుకోవాలి

- డాక్టర్ కేఏవీ సుబ్రహ్మణ్యం,
ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

ఉరుకులు, పరుగులు జీవితాలతో అనేక అనారోగ్య సమస్యల మాదిరిగానే షుగర్‌ను తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారికి మాత్రమే షుగర్ వచ్చేది. ఇప్పుడు 20 ఏళ్ల వారిలోనూ కనిపిస్తోంది. కొవిడ్ వైరస్ వ్యాప్తి తరువాత బాధితుల సంఖ్య పెరిగింది. ఆహారపు అలవాట్లు, ఒత్తిడికి దూరంగా ఉండడం, సమయానికి నిద్రపోవడం, శారీరక వ్యాయామం...ఈ నాలుగింటిపై దృష్టిసారిస్తే 90 శాతం షుగర్ దరిదాపుల్లోకి రాదు. కానీ, ఉద్యోగం, వ్యాపారం అంటూ పరుగులు పెడుతుండడం వల్లే సమస్య ఉత్పన్నమవుతోంది. స్కూల్‌కు వెళ్లే చిన్నారులు ఆడుకునేందుకు గ్రౌండ్ లేకపోవడంతో పీడియాట్రిక్ డయాబెటిస్ కనిపిస్తోంది. 0.5 శాతం మంది చిన్నారుల్లో ఈ సమస్య ఉంటోంది.

ఆలయ భూమికి ఎసరు

... 5వ పేజీ తరువాయి

మూడు సొంత ఇళ్లు ఉన్న దేవస్థానం ఉద్యోగులే ఈ విధంగా మళ్లీ భారీ ఇళ్ల నిర్మాణాలను సిద్ధమవుతున్నారు. ఈ విషయం తెలిసినా దేవస్థానం అధికారులు చోద్యం చూస్తున్నారు. ఆక్రమణదారులు ఆలయానికి చెందిన ఉద్యోగులు కాబట్టే సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు కూడా అనుమతులు లేని ఇళ్ల నిర్మాణంపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. వాటి నిర్మాణం విషయంలో జోక్యం చేసుకోవద్దని దేవస్థానం అధికారులపై రాజకీయ ఒత్తిడులు కూడా వచ్చాయని తెలిసింది. అయితే దేవస్థానానికి చెందిన భూమిని కబ్జా చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా మేల్కొని, దేవుని ఆస్తి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరుతున్నారు. దేవస్థానం స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణంపై ఈఓ ఎస్.నానాజీబాబును 'ఆంధ్రజ్యోతి' విలేకరి వివరణ కోరగా...ఇప్పటికే స్థలం బాగుచేసిన చోట బోర్డును ఏర్పాటు చేశామన్నారు. అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను తొలగించి, బాధ్యులకు నోటీసులు జారీచేస్తామన్నారు. గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రేమ సమాజంలో ముగ్గుల పోటీలు

డాబాగార్డెన్స్, జనవరి 12: సంక్రాంతి పురస్కరించుకుని ముగ్గుల పోటీలను డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం ఆవరణలో కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.ఈ పోటీలలో ప్రేమ సమాజం బాలికలు,స్కూల్ విద్యార్థినులు, కుట్టు శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం చేశారు. కార్యదర్శి హరిమోహనరావు, గుప్తా,సురేష్, నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

41వ వార్డులో..

జ్ఞానాపురం, జనవరి 12: జీవీఎంసీ 41వ వార్డులో వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు ఆధ్వర్యంలో, జ్ఞానాపురం, బాబుకాలనీల్లో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ హాజరయ్యారు. 33వ వార్డులో టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమలాదేవి దంపతులు వెంకటేశ్వరమెట్ట గ్రంథాలయం వద్ద మహిళలకు గండి బాబ్జీ చేతులమీదుగా చీరలు పంపిణీ చేశారు.

రాష్ట్రంలో అరాచక పాలన

» పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జనవరి 12: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. గ్రేటర్ 62వ వార్డు జనతాకాలనీలో శుక్రవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించి తెలుగుదేశం పార్టీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మజ్జి మాలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమమే టీడీపీ ధ్యేయం'

కూర్మన్నపాలెం, జనవరి 12: ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు దుగ్గపువానిపాలెం దానప్ప తల్లి గుడి వద్ద నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. వార్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటమే తన ధ్యేయమన్నారు. ఎస్ఎస్ విజయరామరాజు, డీవీ అప్పారావు, మార్పు శేషు, గోవిందరాజులు, అప్పలరాజు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ హయాంలోనే పట్టాల పంపిణీ'

గాజువాక, జనవరి 12: గాజువాక ప్రాంత భూ సమస్యను టీడీపీ హయాంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పరిష్కరించారని పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జీవో 301 ద్వారా ఐదు వేల పట్టాలు పంపిణీ చేశామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కన్వెన్షన్ డీడ్ పేరుతో రిజిస్ట్రేషన్ ప్రారంభించి, తామే చేసినట్టు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. గాజువాకలో 296 జీవోపై 20 వేలు, 388 జీవో ద్వారా 8 వేల పట్టాలను టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మంజూరు చేశామని, వీటిపై ఆంక్షలు విధించిన వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావుకు చిత్తశుద్ధి ఉంటే ఆంక్షలను ఎత్తివేయాలన్నారు.

గాలి పటాల పండగ రేపు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 12: వైహెచ్ఏఐ ఉక్కునగరం యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం కైట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు ఉక్కు నగరం యూనిట్ కార్యదర్శి వీఆర్కే రాజు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఉక్కు నగర వాసులు హాజరుకావాలన్నారు. వివరాలకు 70136 84439 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఎన్ఏడీ జంక్షన్ జనవరి 12: అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించిన అనాథ వృద్ధుడి మృతదేహానికి శుక్రవారం మమత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు ఎల్లేటి మమత అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబసభ్యులు ఎవరూ రాకపోవడంతో మమతకు సమాచారం ఇవ్వగా, ఆమె సొంత ఖర్చుతో జ్ఞానాపురం శ్మశానవాటికలో అంత్యక్రియలు చేశారు.

ఇంటక్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అప్పారావు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 12: ఇంటక్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉక్కు కార్మికుడు బైరెడ్డి అప్పా రావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు. కార్మిక సంక్షేమానికి కృషిచేస్తానని ఈ సందర్భం గా అప్పారావు పేర్కొన్నారు.



బైరెడ్డి అప్పారావు

సినిమా గైడ్

- **గుంటూరు కారం :** జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, శరత్, శ్రీరామ, సంగం, వెంకటేశ్వర-1, వెంకటేశ్వర-2, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక) లక్ష్మి (గాజువాక) విశేష్, (గాజువాక) మోహిని (గాజువాక) కన్య-1 (గాజువాక), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మౌర్య (గోపాలపట్నం), మినీ మోహిని, విశేష్ (గాజువాక),
- **బబుల్ గమ్:** నటరాజ్-2(పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** శ్రీరామ, నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **హాయ్ నాన్న:** గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 20, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 50, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 52, బీరకాయలు 54, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 17, క్యారెట్ 34, దొండకాయలు 26, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 115, బరబాటి 44, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 32 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 52, చిలగడదుంపలు 30 , కంద 58, దేముడు చిక్కుడు 48, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	599
విజయనగరం	603
శ్రీకాకుళం	603

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	80
ఫారం ధర	--	100
విత్ స్కిన్	--	170
స్కిన్‌లెస్	--	180

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..



గోపాలపట్నం మెయిన్‌రోడ్డులో జన సందోహం



పండగ సందర్భంగా గాజువాక ప్రధాన రహదారిలో రద్దీ

మార్కెట్లకు సంక్రాంతి కళ

» రద్దీగా మారిన వస్త్ర దుకాణాలు
» జోరుగా ఫుట్‌పాత్ వ్యాపారం
» వాహనాల పార్కింగ్‌కు తీవ్ర ఇబ్బందులు

గాజువాక, జనవరి 12: సంక్రాంతి పండగకు కేవలం రెండు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో షాపింగ్ మాల్స్ మొదలుకొని చిన్న వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే కొనుగోలుదారులు షాపుల వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం నుంచి రద్దీ పెరగగా సాయంత్రానికి షాపుల్లోకి వెళ్లేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ సంక్రాంతి నేపథ్యంలో అధిక శాతం మంది దుకాణాల ఎదుట బారులు తీరారు. దీంతో గాజువాక సినిమాహాల్ జంక్షన్ నుంచి కొత్త గాజువాక వరకు జన సందోహం కనిపించింది.

గాజువాకలో తీవ్ర ట్రాఫిక్ సమస్య...

ప్రధాన షాపింగ్ మాల్స్, ఇతర దుకాణాలన్నీ సినిమాహాల్ జంక్షన్ నుంచి కొత్తగాజువాక వరకు రోడ్డుకు ఇరువైపులా వుండడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సాయంత్రం నుంచి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

కిటకిటలాడిన గోపాలపట్నం

గోపాలపట్నం,: సంక్రాంతి సందర్భంగా నూతన వస్త్రాలు, సామగ్రిని కొనుగోలు చేసేందుకు వస్తున్న వారితో గోపాలపట్నం ప్రధాన రహదారి కిటకిటలాడుతోంది. వారం రోజులుగా కాస్త మందకొడిగా సాగుతున్న వ్యాపారం.. గురువారం నుంచి జోరందుకుంది. దీంతో షాపింగ్ మాల్స్, దుకాణాలన్నీ కిక్కిరిసిపోతున్నాయి. రహదారులపై జనాల రాకపోకలు పెరగడంతో రద్దీ వాతావరణం నెలకొంది.



గాజువాకలో రహదారిపైనే వాహనాల పార్కింగ్

ఫుట్‌పాత్‌లపై వెలసిన దుకాణాలు

ఈ ఏడాది గోపాలపట్నంలో ఫుట్‌పాత్ వ్యాపారం జోరుగా సాగుతోంది. బడా షాపింగ్ మాల్స్ మినహా చిన్నచిన్న దుకాణాల్లో ఓ మోస్తరుగా వ్యాపారం సాగుతున్నప్పటికీ ఫుట్‌పాత్‌పై అమ్మకాలు వేగం పుంజుకున్నాయి. గోపాలపట్నం వ్యాపార కేంద్రం కావడంతో కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతుంది. ప్రధాన రహదారిలో వాహన చోదకులే కాకుండా ఫుట్‌పాత్‌పై రాకపోకలు సాగించడానికి కూడా వీలులేని స్థితిలో రద్దీ నెలకొంది. వ్యాపార సముదాయాలకు వచ్చే వారంతా తమ వాహనాలు పార్కింగ్ చేసుకునే అవకాశం లేక మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న సందుల్లో నిలుపుదల చేస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈ సమస్య అధికంగా ఉంటోంది.

నిర్వాసితుల సొంతింటి కల నెరవేరింది

» రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు
» 7,026 మందికి ధ్రువపత్రాల పంపిణీ



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

పెదగంట్యాడ, జనవరి 12: గాజువాక నియోజకవర్గంలోని పేదవాడి నాలుగు దశాబ్దాల సొంతింటి కల నెరవేరిందని రెవెన్యూశాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఉక్కు, ఏపీఐఐసీ నిర్వాసితులకు శుక్రవారం ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ జీవో 301, 388లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను అందజేశారు. ప్రియదర్శినీకాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ నిర్వాసితుల ఇళ్లకు పూర్తి హక్కులు ఇచ్చామన్నారు. వైసీపీ ఉమ్మడి జిల్లా వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పేదవాడి సొంతింటికల నెరవేర్చడమే ధ్యేయమన్నారు. సాంకేతిక కారణాలతో కొంతమందికి స్థలాలు ఇవ్వలేదని, వారికీ పట్టాలు ఇస్తామన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ స్థలాలు పొందిన వారికి హక్కులు కల్పించాలన్న ఉద్దేశంతో రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ కేఎస్ విశ్వనాథన్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజు, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, వురుకూటి రామచంద్రరావు పాల్గొన్నారు.

వివేకానందుని బోధనలు అనుసరణీయం



స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న డి.కృష్ణంరాజు

మల్కాపురం, జనవరి 12: స్వామి వివేకానంద బోధనలు అనుసరణీయమని ఎన్‌సీసీ కమాండర్ రామ్మకృష్ణ అన్నారు. శ్రీహరిపురం స్వామి వివేకానంద పాఠశాలలో శుక్రవారం ఆయన జయంతిని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ దాసరి మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ దాసరి వేణు, అధ్యక్షుడు దాసరి బోధిత్ కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఉన్న వివేకానంద విగ్రహానికి వైసీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నేతలు పొలిమేర శ్రీను, విజయబాబు వివేకానంద సేవలు కొనియాడారు.

పెందుర్తి: యువతకు స్వామి వివేకానందుడు మార్గదర్శి అని వక్తలు అన్నారు. శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.సూర్యకళ వివేకానందుని చిత్రపటానికి నివాళులర్పించారు. రాంపురం సాధన పబ్లిక్ స్కూల్‌లో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు నివాళులర్పించారు.

ఆటోనగర్: ఎల్వీనగర్‌లో శుక్రవారం స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు నిర్వహించారు. బీజేపీ సిటీ వైస్ ప్రెసిడెంట్ దేనంకొండ కృష్ణంరాజు మాట్లాడుతూ నిరాడంబర జీవితాన్ని ఆచరించిన వివేకానందుడి జీవితం ఆదర్శమన్నారు. కార్యక్రమంలో డి.పావని, బాటా శ్రీను, నాయుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో అంగరంగ వైభవంగా కూడారై ఉత్సవం

పెందుర్తి, జనవరి 12: స్థానిక వెంకటాద్రి శిఖరంపై కొలువైన వెంకటేశ్వరస్వామికి ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కూడారై ఉత్సవం నిర్వహించారు గోవిందుని తిరునామాలు ఆకృతిని రూపొందించి 108 గంగాళాలతో ప్రత్యేక ప్రసాద నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. స్వామిని ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకున్నారు.

అగనంపూడి: శాంతినగర్ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. పాశురం విశిష్టతను వివరించారు. 14న గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త ఈకే చారి తెలిపారు.

శ్రీనగర్: గ్రీన్‌సిటీ వైభవ వేంకటేశ్వరస్వామి, శ్రీనగర్ శ్రీకృష్ణ గోవర్ధన ఆలయంలో శుక్రవారం 108 గిన్నెలతో పాయసం నివేదించి కూడారై ఉత్సవం నిర్వహించారు. గోదాదేవి, ఆండాళ్, రంగనాథుల వైభవం, తిరుప్పావై పఠించారు. బండి సురేష్‌కుమార్, వీవీ కృష్ణారావు, పద్మ, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీబీఎల్ ఆలయంలో కూడారై ఉత్సవం

అగనంపూడి: అయోధ్యలోని రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా హిందూవులంతా ఈనెల 22న రామనామం పఠించాలని షిర్డీసాయి సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. భక్తులతో కలిసి అయోధ్యలోని రాముడి ఆలయ చిత్ర పటాలను ఆవిష్కరించారు.

వేపగుంట: నాయుడుతోట వెంకటేశ్వరాలయంలో శుక్రవారం గోదాదేవి సారెను ఊరేగించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు గోదా కల్యాణం అనంతరం నారాయణసేవ ఉంటుందన్నారు.

ఎస్టీబీఎల్ దివ్యక్షేత్రంలో

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కూడారై ఉత్సవం నిర్వహించారు. మహాప్రసాదంను 151 వెండి పాత్రలలో వేసి ఎస్టీబీఎల్ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు దంపతులు గోదాదేవి చిత్రం చుట్టూ అమర్చి నైవేద్యంగా సమర్పించారు.

విజ్ఞాన్‌లో ముగిసిన యువ తరంగ్

అగనంపూడి, జనవరి 12: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన యువతరంగ్ 2కే 24 ఫెస్టివల్ శుక్రవారం ముగిసింది. ఉదయం సంక్రాంతి సంబరాల్లో సింబాసిస్ టెక్నాలజీ ప్రతినిధులు కులదీప్, నరేశ్‌కుమార్, ఓపెన్ క్యూబ్ సీఈవో వినోద్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.భోగి మంటలు, బొమ్మల కొలువు, రంగవల్లులు, నృత్య ప్రదర్శనలు చేశారు. సాయంత్రం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థులు మార్పులకు తగినట్టు రాణించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, డీన్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.




భోగి మంట వేస్తున్న దృశ్యం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: వైవీ సుబ్బారెడ్డి

కూర్మన్నపాలెం, జనవరి 12: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నా రు. సాయిరాంనగర్‌లో శుక్రవారం యూపీహెచ్‌సీ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులో ఉండాలన్న ధ్యేయంతో కణితి పీహెచ్‌సీ, దువ్వాడలో యూపీహెచ్‌సీ భవనాలను, ప్రభుత్వ పాఠశాలలను అందుబాటులోనికి తెచ్చామన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, దామా సుబ్బారావు, జెడ్పీ పి.సింహాచలం, రామచంద్రరాజు, బాబు, శ్రీను పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సేవా రత్న అవార్డు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 12: నగరంలోని మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఏటా ఇచ్చే ఉత్తమ సేవా రత్న అవార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన ఏఎన్ఎం చింతల కనక మహాలక్ష్మిని వరించింది. సంస్థ వ్యవస్థాపకుడు కె.కృష్ణమూర్తి గురువారం నగరంలో ఈ అవార్డును అందించారు.



కనక మహాలక్ష్మి

సురక్షిత నీటితోనే ఆరోగ్యం

మల్కాపురం, జనవరి 12: ప్రతి మహిళ ఆరోగ్యం నీటి వనరులపై ఆధారపడి ఉందని ఏయూ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ టి.ఉషామాధురి పేర్కొన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో శుక్రవారం ఆరోగ్యంలో మార్పులు- చిరోప్రాక్టీస్ థెరపీ అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు.

వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ

ఆటోనగర్, జనవరి 12: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ శాస్త్రవేత్తలతో రూపొందించి వార్షిక క్యాలెండర్ ఆవిష్కరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.రమేశ్ కుమార్ పాల్గొని మాట్లాడారు.

శ్రీకాకుళం ఎంపీని కలిసిన ఉక్కు నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 12: శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును స్టీల్‌ప్లాంట్ టీఎన్‌టీయూసీ నాయకులు గురువారం శ్రీకాకుళంలో కలిసి సమస్యలను వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా కృషిచేయడం అభినందనీయమన్నారు. ప్లాంట్‌లో కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. నూతన వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, నిర్వాసితులకు సరైన ఉపాధి లభించడం లేదన్నారు. ఎంపీని కలిసిన వారిలో బొడ్డు పైడిరాజు, సైతుపతి, నరసింహమూర్తి, కోటేశ్వరరెడ్డి, మోహన్‌రావు ఉన్నారు.



ఎంపీ రామ్మోహన్‌నాయుడుతో నేతలు

ఉక్కునగరం మహిళలకు అభినందన

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 12: యోగాలో ఉక్కునగరం మహిళలు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు. యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఆధ్వర్యంలో ఇటీవల విశాఖలో నిర్వహించిన పోటీల్లో వెంకట శ్యామల, ఎస్.విజయలక్ష్మి, బి.ఉమాదేవి సూర్య నమస్కారాల 216 రౌండ్‌లను 88 నిమిషాల్లో పూర్తిచేశారు. దీంతో ప్లాంట్ సీజీఎం (మెడికల్, స్పోర్ట్స్) కెహెచ్.ప్రకాశ్ అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అవార్డు సాధించిన వారితో సీజీఎం

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరాహార దీక్ష

పెందుర్తి, జనవరి 12: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ మండలాలకు చెందిన అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో శిబిరానికి తరలివచ్చారు. ముఖ్యమంత్రి జగన్ తన మొండివైఖరిని విడనాడాలంటూ నినాదాలు చేశారు. సమీపంలోని మండల పరిషత్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో సరిపల్లి సెక్టార్‌కు చెందిన తొమ్మిదిమంది రిలే నిరాహార శిబిరంలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, ఎఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.అనిత, జిల్లా అధ్యక్షురాలు బృంద, అంగన్‌వాడీ మండల శాఖ ప్రతినిధులు దేవి, లక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

'జాబితాల్లో ఓటు ఉందో లేదో చూసుకోవాలి'

అక్కయ్యపాలెం, జనవరి 12: ఉత్తర నియోజకవర్గంలో జాబితాలో ఓటు ఉందో లేదో చూసుకోవాలని మాజీ క్రికెటర్ జీవీవీఎస్ కమలాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల రోజు ఓటు వేసే సమయంలో పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి ఇబ్బంది పడడంకన్నా ముందుగా లిస్ట్‌లో ఓటును చూసుకోవాలన్నారు. నియోజకవర్గ పరిధిలో 20 వేలకు పైగా దొంగ ఓట్లు నమోదయ్యాయని, వాటిని తొలగించే పనిలో యంత్రాంగం ఉం దన్నారు. అలాగే, వచ్చే ఎన్నికల్లో విద్యావంతుడిని ఎన్నుకోవాలన్నారు. దీని వల్ల తమ పిల్లల భవిష్యత్‌కు, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడుతుందని చెప్పారు.

21 నుంచి పోలమాంబ జాతర మహోత్సవాలు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాజీ బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్

జగదాంబ కూడలి, జనవరి 12: జగదాంబ కూడలి లేపాక్షి వద్ద కువమ్మరవీధిలోని పోల మాంబ 66వ పరస మహోత్సవాలు పురస్కరించుకుని క్యాలెండర్, ఆహ్వాన పత్రికలను బ్రహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ఆవిష్కరించారు. శుక్రవారం అయన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. పోలమ్మ తల్లి పరస ఉత్సవాలు ఈనెల 21 వతేదీనుంచి 23 తేదీ వరకు జరగనున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు వై.రాజు, కాళ్ల కిరణ్, శ్రీనివాస్, తమ్మిన చిన్న, కనకల నాణి, అయ్యబాబుపాల్గొన్నారు.

ప్రజలకు దూరంగా జగన్: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

అల్లిపురం, జనవరి 12: ఎన్నికల ముందు ఓదార్పు యాత్రపేరుతో జనం మధ్య తిరిగిన సీఎం జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు దూరంగా ప్యాలెస్‌కు పరిమితవుతున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. శుక్రవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో విశాఖ జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జగన్ ప్రభుత్వం తీరుపై సొంత పార్టీ ప్రజాప్రతినిధులూ అసంతృప్తిగా ఉన్నారన్నారు.అధికారాన్ని తన గుప్పెట్లో పెట్టుకొని అందరినీ ప్రేక్షకులుగా మార్చేశాడని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఎదురు దెబ్బ తగులుతుందన్నారు.జిల్లా నాయకులు ఎం.పైడిరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలోనే బీసీలకు పెద్దపీట

▸▸ టీడీపీ 'ఉత్తర' ఇన్‌చార్జి విజయ్‌బాబు

సీతంపేట: బీసీలకు టీడీపీ అధినేత చంద్రబాబు పెద్దపీటవేశారని ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌బాబు అన్నారు. గ్రేటర్ 25వ వార్డులో వార్డు అధ్యక్షుడు నమ్మి రవికుమార్, 14వ వార్డు టీడీపీ అధ్యక్షులు గొంప ధర్మారావు ఆధ్వర్యంలో గురుద్వార కూడలిలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగావిజయ్‌బాబు మాట్లాడుతూ, బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం బీసీలకు ఓటు బ్యాంక్‌గానే ఉపయోగించుకుంటుందని ఆరోపించారు. బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనారిటీలపై అనేక దాడులు చేస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నాయకులు విజయ్‌కుమార్, ఇసరపు వాసు, ఇసరపు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



25వ వార్డులో నినాదాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

రెవెన్యూ శాఖ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, జనవరి 12: రెవెన్యూ శాఖ- 2024వ సంవత్సరానికి చెందిన డైరీని కలెక్టర్ ఏ మల్లికార్జున ఆవిష్కరించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జేసీ కేఎస్ విశ్వనాథన్, జిల్లా రెవె న్యూ అధికారి కే మోహనకుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తది తరులతో కలసి డైరీని ఆవిష్కరించారు.కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, అధికారులున్నారు.

గౌడ సంఘం క్యాలెండర్...

మహారాణిపేట: విశాఖ గౌడ సంఘం వార్షిక క్యాలెండర్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆవిష్కరించారు. విశాఖ గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మేరువ గణేష గౌడ్ అధ్యక్షతన సంఘం సభ్యులు శుక్రవారం మేయర్‌ను మర్యాద పూర్వకంగా కలసి ఆమె చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గౌడ సామాజిక వర్గం భవనం మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మార్గాని రామారావు గౌడ్, రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ కామన సుబ్బారావు గౌడ్, ఏవీఎస్ఎన్ మూర్తి, దివి నారాయణరావు, మధుసూదన్, శ్రీనివాస గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ఉర్స్ ఉత్సవాలు



చందనోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మర్రిపాలెం: మర్రిపాలెంలోని మదీనా మెమోరియల్ ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హజరత్ ఖాదర్ అలీ, హజరత్ మౌలా అలీ ఉర్స్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత మసీదులో ముస్లింలు ఖురాన్ పఠించి చిన్నారులచే నాతేకలాం ఆలపించారు. అనంతరం చందనోత్సవ ర్యాలీ నిర్వహించి పాతీహఖానీ జరిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగాశనివారం చిన్నారులతో ప్రత్యేక కార్యక్రమం, ఆదివారం కవ్వాలి పోటీలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పూర్ణామార్కెట్: గ్రేటర్ 38వ వార్డు బుక్కావీధి దర్గావద్ద యాసిన్ బాబా చందనోత్స వాన్ని శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరిపారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడు ధర్మారావుకు ఘన సత్కారం

అక్కయ్యపాలెం, జనవరి 12 : ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర సాహిత్య అకాడమీ, ఏలూరు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సాహిత్య సంక్రాంతి సంబరాలు, కవి సమ్మేళనంలో గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, కవిశ్రేష్ఠ బిరుదాంకితులు ఎంవీ ధర్మారావుకు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మీనరస, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

చీరలు, దుప్పట్లు పంపిణీ

అక్కయ్యపాలెం, జనవరి 12 : విశాఖ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కేవీ బాబా మనమడు ఎండీ ఖాజా మోహినుద్దీన్ నవాజ్ ప్రథమ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నరసింహనగర్‌లోని ఆయన స్వగృహంలో కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. తాజుద్దీన్, ఇస్మాయిల్, నిజాం, బాషా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మర్రిపాలెం, జనవరి 12: శ్రీ విజయనగర కాలనీ, 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం-1లో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 1997-2022లో చదువుకున్న వారంతా 300మంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపలను పంచుకుని ఆటపాటలతో గడిపారు. తరగతి గదులు, గ్రంథాలయం, ల్యాబ్‌ను సందర్శించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం విందు భోజనాలు చేశారు. ఈసందర్భంగా వారు మా ట్లాడు తూ, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు మురళీపట్నాయక్, ఉపాధ్యక్షులు వి.నాగేశ్వరరావు, బి.జోసెఫ్, కార్యదర్శులు కె.మాధవి, ట్రెజరర్ సదరం సన్నిబాబు, కమిటీ సభ్యులు పి.జగన్నాథ్, పంకజ్‌రాథోడ్, వి.కల్పన, గౌరీఈశ్వరి, సునీ లారాణి, జి.జోన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'కేవీ స్వామి సేవలు మరువలేం'



స్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మహారాణిపేట, జనవరి 12: టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షులు కేవీ స్వామి సేవలు మరువలేనివని ఆ పార్టీ కార్యదర్శి పాశర్ల ప్రసాద్ అన్నారు. ఇటీవల మృతిచెందిన కేవీ స్వామి సంతాప సభను శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీకి స్వామి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ కార్యదర్శి గిరిదర్, రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ, నాయకులు ఎస్వీ సుమన్, సి. ఉమాదేవి, శోభన్‌బాబు, సతీష్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్

కంచరపాలెం, జనవరి 12: గత ఇరవై మూడు రోజులుగా సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం విరమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉద్యోగులతో అర్బన్ మండలంలో నాలుగు మండలాల ఎంఈవోలు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ సిబ్బంది శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఏపీవో అప్పలనాయుడు విద్యాసంబంధిత కార్యాకలాపాల పెండింగ్‌పై చర్చించారు. ఉద్యోగులు జీఈఆర్, డ్రాపౌట్స్, ఫార్మేటివ్ పరీక్షల ప్రశ్నపత్రాల పంపిణీ తదితర అంశాలపై దృష్టిని సారించి పూర్తిచేయాలని సూచించారు. విద్యా సంబంధిత పథకాల అమల్లో విశాఖ జిల్లాను ముందుంచాలని కోరారు. ఎంఈవోలు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు



శ్రీ ప్రకాష్‌లో వివేకానందుని వేషధారణలో విద్యార్థులు

సీతమ్మధార, జనవరి 12: స్వామి వివేకానంద 161వ జయంత్యుత్సవం సీతమ్మధార శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశాఖ రామకృష్ణా మిషన్‌కు చెందిన ఆది స్వరానంద స్వామీజీ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. యువజన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు స్వామి వివేకానందుని వేషధారణలో అలరించారు. విద్యార్థులు చిత్రించిన స్వామి వివేకానందుని చిత్రపటాన్ని ఆది స్వరానందస్వామీజీ ఆవిష్కరించారు. వివేకానందుని జీవిత ఘట్టాలను వివరించారు. కొందరు విద్యార్థులు స్వామి వివేకానందుని జీవిత చరిత్రను నాటికగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న శ్రీప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాష్ విద్యార్థులకు యు వజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



వివేకాందుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు

మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో..

మాధవధార; మురళీనగర్ వాకర్స్‌క్లబ్ లో స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి అధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వాకర్స్ క్లబ్ 101 గవర్నర్ సభ్యులు టి. రంగారావు స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మహారాణిపేట: జాతీయ యువజన దినోత్సవం ఏవీఎన్ కళాశాలలో నిర్వహించారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామీజీ గీతా సారందాజీ, జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రతినిధి రహీ మనీస్సా బేగం, ప్రిన్సిపాల్ ఎం సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వాడవాడలా సంక్రాంతి సంబరాలు



ముగ్గుల పోటీ విజేతకు బహుమతి అందిస్తున్న జనసేత ఇన్‌చార్జి ఉషాకిరణ్

మురళీనగర్; మాధవధారలో వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, గంగిరెద్దులు, కోడి పందేలు, రంగవల్లులతో మాధవస్వామి కల్యాణ మండపం పండగ వాతావరణం నెలకొంది. ముఖ్య అతి థిగా విచ్చేసిన ఆపార్టీకోర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, నార్త్ కో-ఆర్డినేటర్‌తో కలసిక్యాలెండర్ ఆవిష్కరించారు.అనంతరం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు దుస్తులను పండుగ కానుకగా అందించారు. వైసీపీ నగర అధ్యక్షులు కోలా.గురువులు, డిప్యూటీ మేయరు కె.సతీష్, పేడాడ.రమణికుమారి ఉన్నారు.

సాలిగ్రామపురంలో ...

అక్కయ్యపాలెం: ఉత్తర నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ ఆధ్వర్యంలో సాలిగ్రామపురం పోర్టు స్కూల్ సమీపాన ఆలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులందించారు. న్యాయ నిర్ణేతలుగా పాలూరి శేషుమాంబ, సంకు వేంకటేశ్వరరావు వ్యవహరించారు. త్రినాథ్,దివాకర్,అడబాల లక్ష్మి ఉన్నారు.

వైసీపీ నేతలైతే ఓకేనా?

వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో కోడి పందెం



కోడి పందేలను వీక్షిస్తున్న వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి, నాయకులు

మాధవధార: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీతో సహా స్థానికంగా ఉన్న పోలీసు అధికారులు హెచ్చరికలు జారీచేస్తున్నారు. అయితే సంక్రాంతి సంబరాల్లో బా గంగా శుక్రవారం మాధవధారలో నిర్వహించిన కోడిపందేలను ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ కో-ఆర్డినేటర్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఉత్తరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు, ఆ పార్టీ సిటీ ప్రెసిడెంట్ కోలా గురువులు దగ్గరుండి వీక్షించారు. నేతలతో కలిసి కోళ్లను ఉత్సాహపరిచేలా సందడి చేశారు. కోడి పందేలు వద్దని పోలీసులు హెచ్చరిస్తుంటే, అధికార పార్టీ నేతలే దగ్గరుండి నిర్వహించడం దేనికి సంకేతమని కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆశ్చర్యపోయారు.

అంతంతమాత్రంగా స్పందన

▸▸ యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు ముందుకు రాని ఆక్రమణదారులు

▸▸ 1,269 మందికి నోటీసులు, 592 మంది దరఖాస్తు

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) కింద ప్రభుత్వ స్వాధీనం చేసుకున్న భూముల్లో వెలిసిన కట్టడాల క్రమబద్ధీకరణకు విధించిన గడువు గతనెల 31తో ముగిసింది. నగరంలో అత్యంత విలువైన ప్రాంతాల్లో నిర్మాణాలు క్రమబద్ధీకరించుకనేందుకు ప్రముఖులు ఎవరు ముందుకు రాలేదు. చివరకు బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలస్‌లో ఆక్రమణల క్రమబద్ధీకరణకు కూడా దరఖాస్తు చేయలేదు. నగర పరిధిలో సుమారు 86 హెక్టార్ల యూఎల్‌సీ భూముల్లో 3,600 కట్టడాలున్నట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. వీటి క్రమబద్ధీకరణకు గత ఏడాది ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీనిప్రకారం 150 గజాలలోపు విస్తీర్ణంలో నిర్మాణాలకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తారు. 150 గజాలు దాటిన కట్టడాలకు నిర్ణీత మొత్తం వసూలు చేస్తారు. ఈమేరకు 1,269 మంది ఆక్రమణదారులకు నోటీసులు జారీచేయగా, వాటిలో 150 గజాలలోపు 999మంది, 150 గజాలు దాటిన 270 మంది ఆక్రమణదారులున్నారు. వీరిలో 150 గజాలలోపు 524 ఆక్రమణదారుల నుంచి దరఖాస్తులందగా 350 మంది భూముల రెగ్యులేషన్‌కు ప్రభుత్వానికి పంపారు. 150గజాలు దాటిన ఆక్రమణలకు సంబంధించి 63మంది మాత్రమే స్పందించి క్రమబద్ధీకరణకు సుమారు రూ. రెండుకోట్ల ఫీజు చెల్లించారు. నగరంలో మిగిలిన కట్టడాల కోసం దరఖాస్తులు అందలేదు. ఈ విషయాన్ని జేసీ కేఎస్ విశ్వనాథన్ వద్ద ప్రస్తావించగా క్రమబద్ధీకరణ గడువు ముగిసిందని, వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వానికి పంపామన్నారు. మిగిలిన వారి విషయంలో ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలుంటాయన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతాలోపం

... 5వ పేజీ తరువాయి

పైగా రోలింగ్ సరిగా చేయకపోవడంతో వాహనాలు వెళుతుంటే పిక్కలు లేచిపోతున్నాయి. సాధారణంగా రోడ్డు నిర్మిస్తుంటే ఇంజనీరింగ్ విభాగంలో సంబంధిత వార్డు బాధ్యతలు చూసే ఏఈ లేదా వర్క్ ఇన్‌స్పెక్టర్ దగ్గరుండి పర్యవేక్షించాలి. తారు నాణ్యతతోపాటు పిక్క పరిమాణం ప్రమాణాలకు అనుగుణంగా ఉందా?, లేదా?...అనేది తనిఖీ చేయాలి. అలాగే రోడ్డు నిర్మాణం బిట్లు, బిట్లుగా జరిగేలా చూడాలి. టెండర్ నిబంధనల్లో పేర్కొన్నట్టుగా సరైన మందంతో రహదారి వేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే తారులేయర్ వేసిన వెంటనే హైడ్రాలిక్ రోలర్‌తో బాగా రోలింగ్ చేయించాలి. కానీ శివాజీ పార్కు ముందున్న డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు దీనికి పూర్తి విరుద్ధంగా జరిగాయి. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రెండు రోజులకే రోడ్డుపై పిక్కలు లేచిపోతున్నాయి. రోలింగ్ కూడా సరిగా చేయకపోవడంతో వాహనాల ఒత్తిడికి రోడ్డు కుంగిపోయి గోతులు ఏర్పడుతోంది. రూ.2.4 కోట్లు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఈ రోడ్డు ఎంతోకాలం ఉండదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

మరోవైపు 19వ వార్డు పరిధి పెదజాలరిపేటలో మెయిన్‌రోడ్డు నిర్మాణం రూ.93 లక్షల వ్యయంతో ఇటీవల చేపట్టారు. నాలుగు అంగుళాలు మందంతో రోడ్డు నిర్మించాల్సి ఉండగా చాలాచోట్ల రెండు అంగుళాలులోపే ఉన్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు తారుతో కూడిన మిక్సింగ్ వేసిన తర్వాత పూర్తిస్థాయిలో రోలింగ్ చేయాల్సి ఉండగా దాన్ని పూర్తిగా విస్మరించినట్టు చెబుతున్నారు. రోడ్డు అంచులను సరిగ్గా రోలింగ్ చేయకుండానే వదిలేశారు. ఈ హడావుడి నిర్మాణంతో రోడ్డు మన్నికపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు మౌనం పాటిస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దీనిపై దృష్టిసారిస్తే అక్రమాలు బయటపడతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

షుగర్ పెరుగుతోంది

... 5వ పేజీ తరువాయి

హార్మోన్ల అసమతుల్యతతో పాటు కొవిడ్ తరువాత శారీరక శ్రమ తగ్గడం, ఉద్యోగ భద్రత, ఆర్థికపరమైన ఇబ్బందులతో తీవ్రమైన ఒత్తిడికి గురి కావడం, మారిన ఆహారపు అలవాట్లు, సమయానికి నిద్రలేకపోవడం వంటివి షుగర్ రావడానికి కారణమవు తున్నాయి. ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవ డంతో పాటు శారీరక శ్రమ చేయడం వల్ల ఈ సమస్యకు చెక్ చెప్పవచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ప్రశాంతమైన జీవనాన్ని అలవాటు చేసుకోవాలి

- డాక్టర్ కేఏవీ సుబ్రహ్మణ్యం,
ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

ఉరుకులు, పరుగులు జీవితాలతో అనేక అనారోగ్య సమస్యల మాదిరిగానే షుగర్‌ను తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారికి మాత్రమే షుగర్ వచ్చేది. ఇప్పుడు 20 ఏళ్ల వారిలోనూ కనిపిస్తోంది. కొవిడ్ వైరస్ వ్యాప్తి తరువాత బాధితుల సంఖ్య పెరిగింది. ఆహారపు అలవాట్లు, ఒత్తిడికి దూరంగా ఉండడం, సమయానికి నిద్రపోవడం, శారీరక వ్యాయామం...ఈ నాలుగింటిపై దృష్టిసారిస్తే 90 శాతం షుగర్ దరిదాపుల్లోకి రాదు. కానీ, ఉద్యోగం, వ్యాపారం అంటూ పరుగులు పెడుతుండడం వల్లే సమస్య ఉత్పన్నమవుతోంది. స్కూల్‌కు వెళ్లే చిన్నారులు ఆడుకునేందుకు గ్రౌండ్ లేకపోవడంతో పీడియాట్రిక్ డయాబెటిస్ కనిపిస్తోంది. 0.5 శాతం మంది చిన్నారుల్లో ఈ సమస్య ఉంటోంది.

ఆలయ భూమికి ఎసరు

... 5వ పేజీ తరువాయి

మూడు సొంత ఇళ్లు ఉన్న దేవస్థానం ఉద్యోగులే ఈ విధంగా మళ్లీ భారీ ఇళ్ల నిర్మాణాలను సిద్ధమవుతున్నారు. ఈ విషయం తెలిసినా దేవస్థానం అధికారులు చోద్యం చూస్తున్నారు. ఆక్రమణదారులు ఆలయానికి చెందిన ఉద్యోగులు కాబట్టే సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు కూడా అనుమతులు లేని ఇళ్ల నిర్మాణంపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. వాటి నిర్మాణం విషయంలో జోక్యం చేసుకోవద్దని దేవస్థానం అధికారులపై రాజకీయ ఒత్తిడులు కూడా వచ్చాయని తెలిసింది. అయితే దేవస్థానానికి చెందిన భూమిని కబ్జా చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా మేల్కొని, దేవుని ఆస్తి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరుతున్నారు. దేవస్థానం స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణంపై ఈఓ ఎస్.నాగాజీబాబును 'ఆంధ్రజ్యోతి' విలేకరి వివరణ కోరగా...ఇప్పటికే స్థలం బాగుచేసిన చోట బోర్డును ఏర్పాటు చేశామన్నారు. అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను తొలగించి, బాధ్యులకు నోటీసులు జారీచేస్తామన్నారు. గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రేమ సమాజంలో ముగ్గుల పోటీలు

డాబాగార్డెన్స్, జనవరి 12: సంక్రాంతి పురస్కరించుకుని ముగ్గుల పోటీలను డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం ఆవరణలో కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.ఈ పోటీలలో ప్రేమ సమాజం బాలికలు,స్కూల్ విద్యార్థినులు, కుట్టు శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం చేశారు. కార్యదర్శి హరిమోహనరావు, గుప్తా,సురేష్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

41వ వార్డులో..

జ్ఞానాపురం, జనవరి 12: జీవీఎంసీ 41వ వార్డులో వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు ఆధ్వర్యంలో, జ్ఞానాపురం, బాబుకాలనీల్లో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ హాజరయ్యారు. 33వ వార్డులో టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమలాదేవి దంపతులు వెంకటేశ్వరమెట్ట గ్రంథాలయం వద్ద మహిళలకు గండి బాబ్జీ చేతులమీదుగా చీరలు పంపిణీ చేశారు.


మైకు ద్వారా ప్రచారం చేస్తున్న పోలీసులు

దొంగతనాల పట్ల అప్రమత్తం

ఎంవీపీ కాలనీ, జనవరి 12 : పండగకు నగరం నుంచి ఇతర ప్రాంతాలకు చాలా ఎక్కువ మంది వెళ్తారు. ఈ సమయంలో చోరీలు అధికంగా జరిగే అవకాశం ఉంది.అందుకనే ఎంవీపీ కాలనీ నేర విభాగం పోలీసులు దొంగలున్నారు జాగ్రత్త అంటూ పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు.ఆటోకు మైకు అమర్చి, వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఊరు వెళ్లినట్లయితే తమకు కూడా సమాచారం ఇస్తే, ఆ ఇంటిపై ఓ కన్నేసి ఉంచుతామని ఎస్ఐ రాందాస్ తెలిపారు. ఇంట్లో విలువైనవి ఏవీ ఉంచొద్దని ఆయన సూచించారు.

బీఆర్‌టీఎస్ నిర్మాణంలో అక్రమాలపై విచారణ జరపాలి : కార్పొరేటర్ పివి

సింహాచలం, జనవరి 12 : బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంలో అధికారులు పలు అక్రమాలకు పాల్పడ్డారని, వాటిపై విజిలెన్స్ విచారణ జరపాలని 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది నవంబరు 19న హడావిడిగా ఇళ్ల తొలగింపు చేపట్టి బాధితులకు ఎటువంటి భోజన, వసతి సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందన్నారు. నష్టపరిహారాలు ఇవ్వడంలోనూ, రోడ్డు నిర్మాణం కొలతల్లోనూ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆరోపించారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

తగరపువలస, జనవరి 12 : స్థానిక జీవీఎంసీ గ్రంథాలయానికి బీజేపీ నాయకులు దేశ నాయకుల జీవిత చరిత్ర పుస్తకాలను శుక్రవారం వితరణగా అందజేశారు. నాయకులు ఉప్పాడ అప్పారావు, ప్రసాదరావు పట్నాయక్, పంపాన శ్రీధర్ చేతుల మీదుగా గ్రంథాలయాధికారి తౌడుకు ఇచ్చారు. అనంతరం వారు గ్రంథాలయాధికారిని సత్కరించారు. కార్యక్రమంలో వెంకటశివ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ

తగరపువలస, జనవరి 12 : అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు గ్రామాల గిరిజనులకు స్థానిక వీఎస్ఆర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.సంక్రాంతి పురస్కరించుకుని అరకు, అనంతగిరి, హుకుంపేట గ్రామాలకు చెందిన వారికి వీటిని అందజేశామని ఆ సంస్థకు చెందిన శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం, జనవరి 12 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి ఇద్దరు దాతలు శుక్రవారం రూ. 2 లక్షలు విరాళంగా సమర్పించారు. మురళీనగర్ ప్రాంతానికి చెందిన బి. హరి జగదీష్‌కుమార్, అక్కయ్యపాలెంకు చెందిన ఆడారి విజయ్‌కుమార్ రూ.100,001, 100,116లును నగదు రూపంలో దేవస్థానం అధికారులకు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాతల కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయం దర్శనం కల్పించి వేదాశీర్వచనాలను, శేష వస్త్రాలను, ప్రసాదాలు అందజేశారు.

పేకాట ఆడితే చర్యలు : సీఐ

పద్మనాభం (రూరల్), జనవరి 12 : సంక్రాంతి నేపథ్యంలో గ్రామాల్లో కోడి పందాలు, పేకాట ఆడితే ఉపేక్షించేది లేదని సీఐ కె. సన్యాశినాయుడు హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పండగను అంతా ఆనందంగా జరుపుకోవాలని, ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు తలెత్తినా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

18న మండల సర్వసభ్య సమావేశం

పద్మనాభం (రూరల్), జనవరి 12 : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18న మండల సర్వ సభ్య సమావేశం జరగనున్నట్టు ఎంపీడీవో ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

సినిమా గైడ్

- **గుంటూరు కారం :** జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, శరత్, శ్రీరామ, సంగం, వెంకటేశ్వర-1, వెంకటేశ్వర-2, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక) లక్ష్మి (గాజువాక) విశేష్, (గాజువాక) మోహిని (గాజువాక) కన్య-1 (గాజువాక), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మౌర్య (గోపాలపట్నం), మినీ మోహిని, విశేష్ (గాజువాక),
- **బబుల్ గమ్:** నటరాజ్-2(పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** శ్రీరామ, నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **హాయ్ నాన్న :** గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 20, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 50, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 52, బీరకాయలు 54, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 17, క్యారెట్ 34, దొండకాయలు 26, బంగాళా దుంపలు 18, అరటి కాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 115, బరబటి 44, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42,దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 32 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 52, చిలగడదుంపలు 30 , కంద 58, దేముడు చిక్కుడు 48, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	599
విజయనగరం	603
శ్రీకాకుళం	603

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	80
ఫారం ధర	--	100
విత్ స్కిన్	--	170
స్కిన్‌లెస్	--	180

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

ఫుట్ ఓవర్ బ్రిడ్డి నిర్మాణానికి శంకుస్థాపన

మధురవాడ, జనవరి 12 : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా రూ. 2.5 కోట్లతో నిర్మించనున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ రహదారి దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్న విషయం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తనదృష్టికి తీసుకురావడంతో నిధుల మంజూరుకు కృషి చేశామన్నారు. ప్రకాష్ ఆర్ట్స్ సంస్థ బ్రిడ్జిని రెండు నెలల్లో నిర్మిస్తుందని చెప్పారు. ప్రకాష్ ఆర్ట్స్ సంస్థ అధినేత మల్లికార్జునరావు మాట్లాడుతూ వంతెనను బీఓటీ పద్ధతిలో నిర్మిస్తామన్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో సుమారు 25 వంతెనలు నిర్మించామని, 150 మీటర్లు పొడవు, పది మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మిస్తామన్నారు. 9 మీటర్లు ఎత్తు ఉంటుందన్నారు. సుమారు 30 మెట్లు ఏర్పాటు చేస్తామని, లైట్లు కూడా ఉంటాయని చెప్పారు. సంక్రాంతి తరువాత పనులు మొదలుపెట్టి రెండు నెలల్లో పూర్తి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక పాల్గొన్నారు.


బ్రిడ్జి శంకుస్థాపన సభలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి


నిర్మించనున్న బ్రిడ్జి నమూనా చిత్రం

రాష్ట్రంలో 31 లక్షల మంది పేదలకు ఇళ్లు

రాష్ట్రంలో 31 లక్షల మంది పేదలకు పక్కా ఇళ్లు కట్టించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందని వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మధురవాడ సుద్దగెడ్డ సమీపంలో నిర్మించిన 240 టిడ్కో గృహాలను శుక్రవారం ఆయన లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మళ్లీ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో 30 వేల కుటుంబాలకు గృహ వసతి కల్పించామన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైసీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, వైసీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తిదాయకం

జయంతి వేడుకల్లో వక్తలు

భీమునిపట్నం, జనవరి 12 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని పలుచోట్ల స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భీమిలి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వున్న వివేకానంద విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు. జీఎస్ఆర్ భవన్‌లో ఆదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కేఎస్ఆర్ కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లోనూ గంటా నూకరాజు పాల్గొని వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, హిందీ శిక్షణార్థులు పాల్గొన్నారు. అలాగే గుప్తా వీధి సాయి సదనం వద్ద వున్న వివేకానంద విగ్రహానికి సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షుడు కోట మల్లికార్జునరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


రేవిడిలో వివేకానంద జయంతి వేడుకలు

భీమునిపట్నం (రూరల్) : దాకమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ వివేకానంద జయంతి నిర్వహించారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు.

మధురవాడలో...

మధురవాడ : స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు అన్నారు. మధురవాడ శివశక్తినగర్‌లో జరిగిన వివేకానంద జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు.

పద్మనాభంలో...

పద్మనాభం : భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన గొప్ప మహా నీయుడు స్వామి వివేకానంద అని ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి.శంకరరావు అన్నారు. శుక్రవారం ఆయన పాఠశాలలో నిర్వహించిన వివేకానంద జయంతి వేడుకల్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గజేంద్ర మోక్షోత్సవానికి శరవేగంగా ఏర్పాట్లు

సింహాచలం, జనవరి 12 : వరాహలక్ష్మీనృసింహస్వామి కొండ దిగువ పూదోటలో ఈనెల 16న జరిగే గజేంద్ర మోక్షోత్సవానికి అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు రాజాలంకారంలో ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పల్లకిలో మెట్ల మార్గంలో పూదోటకు తీసుకువస్తారు. మకరవేట ఉత్సవం అనంతరం రాత్రి 9 గంటలకు కొండదిగువ గ్రామంలోని మూడు వీధుల్లో గజవాహనంపై తిరువీధి జరుపుతారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారి పూదోటకు రంగులు అద్దడం, విద్యుద్దీపాలంకరణ, తోటలో తుప్పల తొలగింపు వంటి పనులు చేస్తున్నారు. అలాగే స్వామిని తీసుకువచ్చే మెట్ల మార్గాన్ని కూడా శుభ్రం చేస్తున్నారు.


ముస్తాబవుతున్న పూదోట

గోదాదేవికి ప్రత్యేక పూజలు

వెంకోజీపాలెం, జనవరి 12 : ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కూడార్రై ఉత్సవం నిర్వహించారు. గోదాదేవిని పెళ్లి కుమార్తె అలంకరణలో తీర్చిదిద్దారు. ఆలయ ప్రధానార్చకుడు వెంకటాచార్యులు సారధ్యంలో అర్చక బృందం మహిళలతో ప్రత్యేక అభిషేకాలు చేయించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు కూడార్రై ప్రసాదాన్ని పంచి పెట్టారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం. సావిత్రి, కోశాధికారి కె. సుబ్బారాయుడు, మేనేజర్ బి. సన్యాసిరావు పాల్గొన్నారు. అలాగే కొత్త వెంకోజీపాలెంలోని సీతా రామాలయంలో వేంచేసి ఉన్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా కూడార్రై ఉత్సవం జరిపారు.

హిందూ కమిషన్ ఏర్పాటుపై చంద్రబాబుకు వినతి

భీమునిపట్నం (రూరల్), జనవరి 12 : హిందువుల సంక్షేమం కోసం రాజకీయాలకు అతీతంగా హిందూ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు వినతిపత్రం ఇచ్చినట్టు హిందూ ధార్మిక పరిషత్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు శివాజీ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రెండు రోజుల క్రితం విజయనగరం జిల్లా బొబ్బిలి వచ్చిన చంద్రబాబును కలిసి హిందూ డిక్లరేషన్ ఆవశ్యకతను వివరించి, వినతిపత్రం ఇచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా చంద్రబాబు తమ పార్టీ అధికారంలోకి రాగానే దేవాదాయ శాఖలో ఉన్న అన్ని విభాగాలను పరిశీలించి, దేవాలయాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు.


చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న శివాజీ

ఘనంగా సంక్రాంతి సంబరాలు

తగరపువలస, జనవరి 12 : తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. చిట్టివలస బంతాట మైదానంలో వైసీపీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. అలాగే సంగివలస ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో కూడా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఆవరణాన్ని పల్లె వాతావరణం మాదిరిగా తయారు చేసి, గాలి పటాలు ఎగర వేశారు.

వెంకోజీపాలెం : జీవీఎంసీ 15, 16వ వార్డుల్లో వైసీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ జరిపారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ ఎం. అప్పారావు, సీహెచ్ నాగేశ్వరరావు, 15వ వార్డు నాయకులు పీల వెంకట పరదేశి నాయుడు పాల్గొన్నారు.

సీపీఎం పోరాటంతోనే నిర్వాసితులకు ఇళ్లు

మద్దిలపాలెం, జనవరి 12 : సీపీఎం 38 ఏళ్ల సుదీర్ఘ పోరాటం వల్ల ఉక్కు నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు చెప్పారు. మద్దిలపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్ణవానిపాలెం, శనివాడ గ్రామాలకు చెందిన 97 మంది నిర్వాసితులకు 107 గజాల ఇంటి స్థలం ప్రభుత్వం మంజూరు చేయడం సీపీఎం విజయమన్నారు. ఉక్కు కర్మాగారానికి 23 వేల ఎకరాలు ఇచ్చిన నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా అనేక ఇబ్బందులు పెట్టారని, నిర్వాసితులకు అండగా సీపీఎం పోరాటం చేసిందని గుర్తుచేశారు. ఎట్టకేలకు 97 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. తక్షణమే వారు ఇళ్లు నిర్మించుకోవడానికి రూ. 10 లక్షలు రాయితీతో కూడిన రుణాలు కూడా అందించాలని కోరారు.

ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం

సాగర్‌నగర్, జనవరి 12 : రుషికొండ గాయత్రి విద్యాపరిషత్ సమీపంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఎలక్ట్రికల్ బైక్ శుక్రవారం దగ్ధమైంది.గాయత్రి విద్యాపరిషత్‌లో పనిచేస్తున్న మనోజ్ నగరంలో నుంచి ఎలక్ట్రికల్ బైక్‌పై కళాశాలకు వస్తుండగా ఒక్కసారిగా వాహనంలో నుంచి పొగలు రావడాన్ని ఆయన గమనించారు. వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశారు. ఆయన వాహనం దిగిన పది నిమిషాల వ్యవధిలోనే దట్టమైన మంటలు వ్యాపించి క్షణాల్లో వాహనం దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా బైక్ కాలిపోయినట్టు ఆయన చెప్పారు.


దగ్ధమవుతున్న బైక్

ఎమ్మెల్యే ముత్తంశెట్టిపై 420 కేసు పెట్టాలి

» టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్

సింహాచలం, జనవరి 12 : పాత గోశాల కూడలి నుంచి పాత అడివివరం వరకు బీఆర్‌టీఎస్ కారిడార్ నిర్మాణంలో భాగంగా నిర్వాసితులకు లేనిపోని హామీలు ఇస్తూ మోసాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై 420 కేసు నమోదు చేయాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌టీఎస్ సమస్యపై నిర్వాసితులతో ఆరుసార్లు సమావేశాలు ఏర్పాటు చేయగా అన్నింటిలోనూ వేర్వేరు హామీలిస్తూ ఎమ్మెల్యే మోసం చేశారని ఆరోపించారు. నష్టపరిహారం, టీడీఆర్‌లపై పదే పదే మాట మారుస్తున్నారని విమర్శించారు.

జనసేన కార్యకర్తలతో సమావేశం

ఎండాడ, జనవరి 12 : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఉన్న భీమిలి నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు 8వ వార్డు అధ్యక్షుడిగా నియమించిన శాఖరీ శ్రీనివాస్‌ను అందరికీ పరిచయం చేశారు.ఈ సమావేశంలో జనసేన నాయకుడు బీవీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్


శిబిరంలో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం

ఆనందపురం, జనవరి 12 : అంగన్‌వాడీలకు టీడీపీ అండగా వుంటుందని పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు అన్నారు. శుక్రవారం ఆయన ఆనందపురం జంక్షన్‌లో రిలే దీక్ష చేస్తున్న అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు అంగన్‌వాడీల సమస్యలన్నీ పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కుమార్, మణి, ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, భీమిలి యూనియన్ నాయకులు ఎం. శ్రీదేవి, కె. వెంకటలక్ష్మి, పి. పద్మ, తదితరులు పాల్గొన్నారు.

పోలకు ఉత్తమ ఎన్ఎస్ఎస్ అధికారి అవార్డు

మద్దిలపాలెం, జనవరి 12 : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు పోల ఉమామహేశ్వరరావుకు కళాశాలల విద్యాశాఖ కమిషనర్ పోల భాస్కర్ శుక్రవారం విజయవాడలో రాష్ట్ర ఉత్తమ ఎన్ఎస్ఎస్ అధికారి అవార్డు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులను విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొనేలా అధ్యాపకులు ప్రోత్సహించాలన్నారు.


ఉమామహేశ్వరరావు అవార్డు అందిస్తున్న దృశ్యం

ఘనంగా కూడార్రై ఉత్సవం

భీమునిపట్నం, జనవరి 12 : పట్టణంలోని వెంకటగిరిపై వెలసిన సాగర తిరుమల క్షేత్రంలో శుక్రవారం పద్మావతి, గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరాలయంలో కూడార్రై ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పలాచార్యులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం 108 గంగాళములతో అక్కరడిశల్ విశేష ప్రసాదాన్ని మంగళశాసనములతో స్వామివారికి నివేదించారు.ఈ కార్యక్రమంలో ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి, సభ్యులు అప్పలనరసయ్య, శ్రీరామచంద్రమూర్తి, సత్యానందం, పాల్గొన్నారు.